# మినీ కథలు:

## కథక చక్రవర్తి



చొళ్ల విష్ణు

ఒక నవయువకుడు సంపాదకుని గుమ్మం ముందు నిలబడి ప్రతీక్షిస్తున్నాడు. కథ రాసి తీసుకొచ్చాడు. సంపాదకుని కివ్వాలని అతని కోరిక. తలుపు తట్టడానికి సాహసించలేకపోతున్నాడు. ఎవరో లోపలినుంచి బైటకు వెడుతూ "ఎవరు కావాలి?" అని ప్రశ్నించారు. "సంపాదక మహాశయుని కలుసుకోవా"లన్నాడు యువకుడు. "వున్నారు వెళ్ళు లోపలికి"అంటూ ఆయన వెళ్ళిపోయాడు. నవ యువకుడు ధైర్యం కూడదీసుకొని లోపల ప్రవేశించాడు.

కండ్ల జోడుతో కుర్చీమీద కూర్చుని తదేక దృష్టితో ఏదో చదువుకొంటున్నాడు సంపాదకుడు. ఆగంతకుని పాదధ్వని విని తల పైకెత్తి చూశాడు.

నమస్కారం చేసి "కథ రాసుకొచ్చాను తమకిద్దామని" అంటూ జేబునుంచి కాగితాలు తీస్తున్నాడు యువకుడు.

"ఇంతకు ముందు ఏ పత్రికకన్నా రాశావా?" అని ప్రశ్నించాడు సంపాదకుడు.

'లేద'న్నాడు నవ యువకుడు.

"అయితే జేబులో పెట్టుకో కథ. ఆఫీసులో గుట్టలుగా పడివున్నవి కథలు. కొత్తవి స్వీకరించం" అన్నాడు సంపాదకుడు.

"దయచేసి తమ రొకసారి చూడండి కథ" అన్నాడు యువకుడు.

"అంత తీరికలేదు" వెళ్ళమన్నాడు సంపాదకుడు మూకీభావంతో.

"ఎంతో శ్రమపడి రాశాను. తప్పకొకసారి చూడండి. ఇక్కడుంచి వెడతాను. తమకు తీరిక వున్నప్పుడే చూడండి" అంటూ కథ మేజామీద పెట్టి వెళ్ళిపోయాడు నవ యువకుడు.

కొన్ని రోజులు గడిచాయి.

తలుపు తట్టుతున్న చప్పుడయింది. తలుపు తెరచి చూశాడు యువకుడు. అఘాటుగ వచ్చి నిలబడివున్న సంపాదకుని చూచి నివ్వెరపోయాడు. నవ్వుతూ "మీ గది నెంబరు పట్టుకోడానికెంతో తిరిగాను" అన్నాడు సంపాదకుడు.

"అయ్యో! ఎందుకండీ యింత శ్రమపడ్డారు. కబురుచేస్తే నేనే వచ్చి తెచ్చుకుందునుగా రచన" అన్నాడు యువకుడు వినయంగా.

జేబు నుంచి వెయ్యి రూపాయల నోటు తీసి నవ్వుతూ "ఇదిగో మీ కథకు పారితోషికం" అంటూ యువకునికిచ్చి. "ఇంకేమైనా రచనలుంటే యివ్వండి. ఈ దేశం (ఫ్రాన్సు)లో వర్తమాన రచయితల్లో యిలాంటి కథలు రాసేవారు లేరు" అన్నాడు సంపాదకుడు.

ఆ నవ యువక రచయిత పేరు "మపాసా." ఆయన చిన్న కథలు రాయడంలో అసాధారణ శక్తి సంపాదించుకున్నాడు. ప్రపంచ రచయితలకు మార్గదర్శకు డయ్యాడు.

"ఫ్రాన్సులో ప్రసిద్ధ పత్రిక "ప్యారీ హెరాల్డు" సంపాదకుడు ఆ వేళ నా గుమ్మం వద్దకు వచ్చి నన్ను ప్రోత్సహించకపోతే, నే నిన్ని కథలు రాసి వుండేవాణ్ణి కాదు. ఇంత ప్రఖ్యాతి పొందేవాణ్ణి కాదు" అని మపాసా స్వయంగా రాసుకున్నాడు.

(బెంగాలీ నుంచి అనువాదం)

---

## అవును... కాదు!



శాంతమూర్తి

"ఈ వేళ సాయంత్రం సినిమాకి వెడదామా?" అంది సుశీల.

"సినిమా ఎందుకు? పబ్లిక్‌గార్డెన్‌కి వెడదాం" అన్నాడు రామారావు.

సుశీల, రామారావు భార్యా భర్తలు.

"కాదండీ! మీరాలో మంచి సినిమా వచ్చింది. రేపటితో వెళ్ళిపోతుంది."

"అయితే రేపే వెడదాంలే. ఈ వేళ మటుక్కి పబ్లిక్ గార్డెన్‌కే వెడదాము."

"అలాకాదు. ఈ వేళ సినిమాకే వెడదాం."

"కాదు! పబ్లిక్ గార్డెన్‌కే వెడదాం."

* * *

"ఏం కూర వండమంటారు ఈవేళ" అంది సుశీల.

"వంకాయ కూర వండు" అన్నాడు రామారావు.

"కాదు అరటికాయలు వండుతాను."

"ఎందుకు! వంకాయలే వండు."

"అరటికాయలే వండుతానండీ! రేపటికి మెత్తబడతాయి".

"ఆ మాత్రందానికి నన్ను అడగడం ఎందుకు? నీకిష్టం వచ్చిందేవండు," అన్నాడు కోపంగా రామారావు.

"మీకు కోపం ఎందుకు? వంకాయలే వండుతాను."

"ఈ మాత్రం దానికి నాకు కోపం అని పేరు పెట్టడం ఎందుకు? అరటికాయలే వండు."

సుశీల విసురుగా లోపలికి వెళ్ళింది.

* * *

"ఈమధ్యన నీలో మార్పు కనిపిస్తోందోయ్" రామారావు అన్నాడు.

"అవునండీ! నాకూ అలాగే అనిపిస్తోంది. పుల్లటి పళ్ళు తినా లనిపిస్తోంది. నోటికి అన్నం హితవు వుండడంలేదు. ఎక్కువ అలసటగా వుంటోంది" అంది సుశీల.

"అలాగా! అయితే నువ్వు తల్లివి కాబోతున్నా వన్నమాట. కంగ్రాచ్యులేషన్స్." ఉత్సాహంగా అన్నాడు రామారావు.

"కాదండీ! మీరు తండ్రి కాబో

తున్నారు" అంటూ సన్నగా నవ్వి "బాబుకి ఏం పేరు పెడదా మంటారు?" అంది సుశీల.

"బాబుకాదు. పాప కావాలి నాకు."

"కాదండీ బాబే పుడతాడు."

"నాకు పాపే కావాలి."

*

ఈ మోస్తరుగా కొన్ని ఏళ్ళు గడిచాయి. సుశీల బాబాయి పరమేశంగారు వచ్చారు ఏదో పనిమీద. మాటల్లో సుశీల అంది: "బాబాయ్: ఈయనతో ఇదే వరస. నేనే మాట అన్నా కాదనడం ఆయనకు సరదా. ప్రతిదానికి ఏదో ఒక గోల. ఆరేళ్ళనుంచి ఒక్కలాగే వుంది ఆయనతో."

"ఆరేళ్ళుకాదు. ఏడేళ్ళనుంచి" అందు కున్నాడు రామారావు.

"కాదు ఆరేళ్ళనుంచే"

"కాదు! ఏడేళ్ళనుంచి."


రెక్సోనా మీ చర్మాన్ని సంరక్షిస్తుంది...





మృదువుగా మెరిసేలా ఉంచుతుంది

రెక్సోనాలో ఉంది
సహజసిద్ధమైన నాలుగు
నూనెల సమ్మేళనం

హాపుషా (దేవదారు జాతి), లవంగ పట్ట, లవంగ, సరళం అనే ఈ నూనెలు మీ చర్మంలో ఊరే నూనెలంత సహజసిద్ధమైనవి. రెక్సోనాతో స్నానం చెయ్యండి—మీ చర్మం ఎలా ప్రకాశిస్తుందో మీరే చూసుకోండి. మీరెంతో ఇష్టపడే పరిమళాన్ని చర్మంపై నిలిపి గుబాళింపజేసే రెక్సోనా మీ చర్మ సంరక్షణ కోసం సహజమైన సాధనం.




రెక్సోనా మీ చర్మ సౌందర్యం కోసం

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

లింటాస్-RX.75-203 TL (RR)